క్లుప్తంగా

జాగ్రత్తలు పాటిస్తే టీబీ దూరం



అవగాహన కల్పిస్తున్న టీబీ కంట్రోల్ సూపర్ వైజర్ లలిత

చీపురుపల్లి: ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల టీబీ వ్యాధికి దూరంగా ఉండవచ్చని టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ జి.లలిత చెప్పారు. టీబీ నివారణపై మండలంలోని పర్ల గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో టీబీ నివారణపై వంద రోజుల అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధికి సంబంధించి ఎక్స్‌రే, టీబీ పరీక్షలు ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. టీబీ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అపరాల పంటల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట కావాలంటే ప్రకృతి సాగు బాట పట్టాలని ఆయన తెలిపారు.

పరామర్శ



ముత్యాలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు తల్లి ముత్యాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను శనివారం కలిసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనంతరం ముత్యాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీపీ జి.శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు పాల్గొన్నారు.

219 మందికి వైద్యసేవలు



వృద్ధుడికి మందులు అందజేస్తున్న దృశ్యం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 219 మందికి వైద్యులు సేవలందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పలరమణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

శృంగవరపుకోట: స్థానిక సత్యసాయిబాబా మందిరంలో భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు శనివారం నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై శ్లోకాలు చదవడంలో విశేష ప్రతిభ కనబరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆర్డీవో సందర్శన



బొండపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఆర్డీవో కీర్తి

బొండపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి శనివారం సందర్శించారు. ఎన్నికలు జరిగిన తీరు, ఏయే ప్రాంతాల్లో ఏయే కారణాలతో ఎన్నికలు వాయిదా వేయడం జరిగిందన్న విషయాలపై అధికారులను ఆరాతీశారు. బి.రేజేరులో ఎన్నికలు వాయిదా వేసినట్లు తహసీల్దారు డోలా రాజేశ్వరరావు తెలిపారు.

ఆరు నెలల్లో.. నిర్మాణ రంగం కుదేలు!

- నిర్మాణ రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆరు నెలల్లో ఒక్క ఇల్లు మంజూరు చేయని వైనం
- బిల్లులు మంజూరవ్వక పలుచోట్ల నిలిచిన నిర్మాణాలు
- సర్వే పేరుతో చంద్రబాబు సర్కారు కాలయాపన
- పనుల్లేక వలసబాటలో భవన నిర్మాణ కార్మికులు



బోడసింగిపేటలో నిలిచిన భవన నిర్మాణాలు

బొండపల్లి: కూటమి ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం కుదేలవుతోంది. అధికారంలోకి వచ్చి, ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరికీ ఇల్లు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో నిరుపేదలందరికీ ఇంటిస్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి మరీ ఇస్తామన్న చంద్రబాబు సర్కారు ఆ దిశగా ఏ రకమైన చర్యలు చేపట్టలేదు. మరోవైపు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు సైతం ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చాలాచోట్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో ఇళ్లు లేక లబ్ధిదారులు.. పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చిన ఆర్థికసాయం రెట్టింపు చేసి ఇస్తామన్న ప్రభుత్వం ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల వివరాలు..

మండలం	సొంత ఇళ్లస్థలాల్లో	జగనన్న లే అవుట్లో ఇళ్లు	మొత్తం ఇళ్లు
బొండపల్లి	1152	885	2037
గజపతినగరం	1526	1198	2724
మెంటాడ	1176	426	1602

గతంలో నిధుల కొరత లేకుండా..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ నిర్మాణ రంగానికి ఎటువంటి నిధుల కొరత లేదు. అర్హత ప్రామాణికంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లనిర్మాణాలు కూడా చేసి ఇవ్వడంతో ఇంటి కల సాకారమైందని అటు లబ్ధిదారులు.. చేతినిండా పని దొరికి ఉపాధి లభించిందని ఇటు భవన నిర్మాణ కార్మికులు ఆనందించేవారు. దీంతో పాటు సొంతంగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు కూడా జరిగేవి. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి సర్కారు హయాంలో మాత్రం ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా మంజూరవ్వలేదు. దీనికితోడు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు సంబంధించి, బిల్లులు కూడా చేయకపోవడంతో చాలాచోట్ల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. అలాగే ఇసుక ధరలు కూడా భారీగా ఉండడంతో నిర్మాణ రంగం దివాలా తీసిందని, ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తాపీమేస్త్రీలు, కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీలేక వారంతా పనుల కోసం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు వలస పోతున్నారు.

గ్రామాల్లో సర్వే..

ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం.. ఇళ్లు మంజూరు చేయకుండా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేస్తూ కాలయాపన చేస్తోంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వ హయాంలోనూ ఇళ్లు మంజూరు కాని వారు ఎంతమంది ఉన్నారు..తప్పనిసరిగా ఇల్లు కడితేనే మంజూరు చేస్తామని.. కొంత కట్టి అసంపూర్తిగా వదిలేస్తే మంజూరు చేయబోమని చెబుతూ సర్వేలో స్పష్టమైన హామీని లబ్ధిదారులు(ఇళ్లు కట్టాలనుకునే వారు) నుంచి తీసుకుంటున్నారు. ఆరు నెలల్లో ఎక్కడా ఎటువంటి నిర్మాణాలు జరగకపోవడంతో ఇళ్లు ఆశించే వారు.. ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన వారు.. భవన నిర్మాణ కార్మికులంతా ఎప్పుడు ఇళ్లు ఇస్తారా.. ఎప్పుడు నిర్మాణాలు జరుగుతాయా అని ఎదురుచూస్తున్నారు. నిర్మాణ రంగాన్ని బతికించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిరోజూ పని ఉండడం లేదు..



గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. అప్పట్లో చేతి నిండా పని ఉండేది. కుటుంబ పోషణ సులభమైంది. ఇప్పుడు ఎక్కడా నిర్మాణాలు అంతగా జరగకపోవడంతో ప్రతిరోజూ పని ఉండడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– సీహెచ్ రమణ, తాపీమేస్త్రీ, గొట్లాం గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం..



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటివరకు ఇళ్లు మంజూరు చేయకపోవడం.. నిర్మాణాలు జరగకపోవడంతో పనుల్లేవు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి గడ్డు పరిస్థితి లేదు. ప్రతిరోజూ పని దొరికేది.

– బోడసింగి సీత, బొడసింగిపేట గ్రామం, భవన నిర్మాణ కార్మికురాలు

రాజీయే రాజమార్గం



శృంగవరపుకోట: కేసుల పత్రాలు పరిశీలిస్తున్న జడ్జి వాణి



కొత్తవలస: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి విజయచంద్ర



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి కనకలక్ష్మి



చీపురుపల్లి: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న న్యాయమూర్తి ప్రేమలత

శృంగవరపుకోట: రాజీయే రాజమార్గం అని, కేసుల రాజీకి రాజమార్గం అనుసరించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. మండల కేంద్రంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి, పలు కేసులను పరిష్కరించారు. మొత్తం 392 కేసులు పరిష్కరించగా, వాటిలో సివిల్ కేసులు 4, చెక్‌బౌన్స్ కేసులు 2, మనోవర్తి కేసులు 01, ఎక్సైజ్ కేసులు 44, బ్యాంకు ప్రీలిటిగేషన్ కేసులు 15, క్రిమినల్ కేసులు 326 ఉన్నాయని ఆమె తెలిపారు. కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయవాదులు, రాజీకి వచ్చిన కక్షిదారులకు ధన్యవాదాలు తెలిపారు.

కొత్తవలస: స్థానిక కోర్టు సముదాయంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 274 పెట్టీ కేసులు, 48 ఎక్సైజ్ కేసులు, 5 ప్రామిసరీ నోటు కేసులు, 32 ఐపీసీ కేసులు, 10 ఇతర కేసులు పరిష్కరించారు. రాత్రి 8 గంటల వరకు లోక్ అదాలత్ కొనసాగడంతో కేసుల రాజీకి వచ్చిన కక్షిదారులకు కోర్టు ఆవరణలోనే బార్ అసోసియేషన్ భోజనం ఏర్పాటు చేసింది.

గజపతినగరం: స్థానిక సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 541 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, కేసుల రాజీకి రాజీమార్గం అనుసరించాలని ఆమె సూచించారు.

చీపురుపల్లి: లోక్ అదాలత్‌లో ఇరువర్గాలకు సత్వర న్యాయం లభిస్తుందని చీపురుపల్లి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత చెప్పారు. కోర్టుహాల్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 596 కేసులు రాజీ చేశామని తెలిపారు. వీటిలో 96 క్రిమినల్ కేసులు, 489 సమ్మరీ ట్రైల్ కేసులు(ఎస్‌టీసీ), 11 సివిల్ కేసులు ఉన్నాయన్నారు. కక్షిదారులు కేసులను రాజీ చేసుకుని విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసుల రాజీకు పోలీస్ శాఖ సహకరించాలని కోరారు.

బీమాతో ప్రయోజనం

చీపురుపల్లి: అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా మామిడి పంటకు కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి మామిడి పంటలో వాతావరణ ఆధారిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అకాల, అధిక వర్షపాతం కారణంగా పంట దెబ్బతిన్నా, చీడ, పీడలు, అనుకూల వాతావరణం, ఉష్ణోగ్రతలో వ్యత్యాసం, అధిక గాలి వేగం ద్వారా పంట నష్టపోతే బీమా వర్తిస్తుందన్నారు. 2024 డిసెంబర్ 15 నుంచి 2025 మే 31 మధ్య కాలంలో ప్రతికూల వాతావరణం నుంచి మామిడి పంటకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. రైతులు రూ.2 వేలు చొప్పున ప్రీమియంను చెల్లించాలన్నారు.

వితరణ

బొండపల్లి: దత్త జయంతి పురస్కరించుకుని, మండలంలోని దేవుపల్లి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన అన్నం గిరిధర్ దంపతులు.. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు పలువురు విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు శనివారం వితరణ చేశారు. తమకు తోచిన దానిలో ఎంతో కొంత పరులకు సాయం చేయడం తృప్తినిస్తోందని దాతలు తెలిపారు.

వనసమారాధన

శృంగవరపుకోట: మండలంలోని కాపుసోంపురం వద్ద వెలమ కులస్తుల వనసమారాధన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వేచలపు చినరామునాయుడు, నెక్కలత నాయుడుబాబులతో పాటు మరికొంతమంది వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఉద్యోగులు హాజరై, భోజనాలు చేసి సరదాగా గడిపారు.

డయాలసిస్ రోగులకు ఝలక్..

- 108 అంబులెన్స్ సేవలు నిలిపివేయడంతో అవస్థలు పడుతున్న రోగులు
- రవాణా కోసం వేలాది రుపాయలు ఖర్చు చేస్తున్న రోగులు
- నాలుగేళ్లలో 15,009 మందికి సేవలు
- ప్రైవేట్ వాహనాల ద్వారా డయాలసిస్ సెంటర్‌కు వస్తున్న వైనం



విజయనగరం ఫోర్ట్: పై ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు జన్ని రమణమ్మ. సాలురు మండలం గంగందరవలస గ్రామం. విజయనగరం డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుని ఆటోలో తిరిగి గంగందరవలస వెళ్తున్నారు. విజయనగరం సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు ఆటోపై వచ్చి తిరిగి గ్రామానికి వెళ్లేందుకు ఆటో డ్రైవర్‌కు రూ. 2500 ఇచ్చారు.



డయాలసిస్ సెంటర్



- పక్క ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఉప్పు రమణమ్మ. ఈమెది జి. సిగడాం మండలం పాలఖండ్యాం గ్రామం. ఈమె తనభర్త ఉప్పు అప్పలనాయుడుకు డయాలసిస్ చేయించడానికి బస్సుపై వచ్చారు. డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లడానికి వారికి బస్సులు, భోజనం, ఇతర ఖర్చులకు రూ.500 వరకు ఖర్చు అయింది.

వీరిద్దరే కాదు.. అనేక మంది రోగులు డయాలసిస్ సెంటర్‌కు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. డయాలసిస్ రోగుల అవస్థలను చూసి గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వారికి కూడా 108 సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డయాలసిస్ చేయించుకోవాలనుకునే రోగులు 108కు ఫోన్ చేస్తే వారి ఇంటికి వెళ్లి రోగిని ఎక్కించుకుని డయాలసిస్ సెంటర్‌కు తీసుకెళ్లేవారు. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత డయాలసిస్ రోగులకు 108 సేవలను నిలిపివేసింది. దీంతో డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 2020 నుంచి జిల్లాలో డయాలసిస్ రోగులకు 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి వేలాది మంది కిడ్నీ రోగులను అంబులెన్స్ సేవలు వినియోగించుకున్నారు.

15,009 మందికి..

2020 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకు 15,009 మంది కిడ్నీ, డయాలసిస్ రోగులు 108 వాహన సేవలు వినియోగించుకున్నారు. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉండడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.

సేవలు నిలిపివేశాం..

డయాలసిస్ రోగులకు 108 సేవలు నిలిపివేశాం. డయాలసిస్ రోగులను తరలించే సమయంలో అత్యవసర కేసులు వస్తే వాటికి అటెండెంట్ కాలేకపోతున్నాం.

– నజీర్ హుస్సేన్, 108 జిల్లా మేనేజర్

బిర్యానీ సెంటర్‌లో గోమాంసం ఘటన నిగ్గు తేల్చాల్సిందే..



కొత్తవలస మండల కేంద్రంలోని విశాఖపట్నం రోడ్డులో ఓ బిర్యానీ సెంటర్‌లో గోమాంసం కలకలం ఘటనపై నిగ్గు తేల్చాల్సిందేనని బీజేపీ నాయకులు పట్టుబట్టారు. ఇదే విషయమై లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఆ పార్టీ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరంగం దానేష్ శనివారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల బిర్యానీ సెంటర్‌లో 60 కిలోల ఆవు మాంసం లభ్యమైనట్లు పలు వార్తా పత్రికల్లో కథనాలు వచ్చాయని, అయినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నిందితుడిపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అన్ని మతాల వారు వెళ్లి భోజనం చేసే చోట హిందువుల ఆరాధ్య దైవమైన గోమాత మాంసం వండిపెట్టడం.. హిందువుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. ఇప్పటికైనా ఆ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.రామకోటి, డి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. – లక్కవరపుకోట

విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం



శృంగవరపుకోట మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటం చేస్తోందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఎస్ఎఫ్ఐ ద్వారా మరిన్ని పోరాటాలు కొనసాగించి, విద్యార్థులు, విద్యారంగానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం జరిగిన మహాసభలో మండల కమిటీ ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా కె.రమేష్, అధ్యక్షుడిగా చైతన్య, మండల బాలికల కమిటీ కన్వీనర్‌గా అనూ ఎన్నికయ్యారు. – శృంగవరపుకోట

నీటి సంఘాల ఎన్నికల బహిష్కరణ



వల్లాపురం బద్ది చెరువు నీటి సంఘానికి ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న సీడీపీఓ ఆరుద్ర

వేపాడ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించినట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా ఏకపక్షంగా వారికి అనుకూలంగా నిర్వహిస్తున్నందునే ఎన్నికల నుంచి తప్పుకున్నట్లు స్పష్టం చేశారు.

- **దత్తిరాజేరు:** మండలంలోని 15 గ్రామాల్లో 22 సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో 21 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పెదకదలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య పొత్తు కుదరకపోవడంతో అక్కడి ఎన్నిక వాయిదా పడింది.
- **గజపతినగరం:** మండలంలో 11 చిన్నతరహా, 2 మధ్య తరహా నీటిపారుదల సంఘాలకు శనివారం ఎన్నికలు జరగ్గా, ఆయా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.
- **రెండు చోట్ల ఎన్నికలు వాయిదా..**

బొండపల్లి: మండలంలోని ఏడు గ్రామాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. 11 మైనర్, 1 మీడియం సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేయగా, బి.రేజేరులో రెండు సాగునీటి సంఘాల ఎన్నికలకు అభ్యర్థులెవరూ ముందుకు రాకపోవడంతో అక్కడ ఎన్నికలు వాయిదా వేశారు. మిగతా వాటిని ఎన్నికలు నిర్వహించారు.

- **శృంగవరపుకోట:** మండలంలోని 20 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దారు అరుణకుమారి వెల్లడించారు.
- **వేపాడ:** మండలంలో 26 నీటి సంఘాలకు గాను 20 సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఇరిగేషన్ ఏఈ హేమకుమార్ తెలిపారు.
- **స్పందన కరువు..**

లక్కవరపుకోట/కొత్తవలస: మండలాల్లో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలకు స్పందన కరువైంది. ఒక్కో సంఘంలో ఆరుగురు సభ్యులు ఉంటారు. నామినేషన్ వేసేందుకు ఒక్కో అభ్యర్థికి ఇద్దరేసి రైతులు చొప్పున ప్రపోజ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ తరహా వ్యక్తులు లేకపోవడంతో టీడీపీ నాయకులు రైతులను బతిమలాడి మరీ ఎన్నిక ఏకగ్రీవం చేసుకున్నారు. కొత్తవలసలో 9 సంఘాలకు గాను 8 సంఘాల డైరెక్టర్లు, చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. లక్కవరపుకోటలో 18 సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. కళ్లేంపూడి, కొట్యాడ గ్రామాల్లో ఎన్నికలు వాయిదా వేసినట్లు సమాచారం.

- **గుర్ల:** మండలంలోని 12 నీటి సంఘాలకు అధికారులు శనివారం ఎన్నికలు నిర్వహించారు. వీటిలో ఏడు నీటి సంఘాలు ఏకగ్రీవం కాగా, వల్లాపురం, జమ్ము, బోదవరం, గూడేం నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వల్లాపురం నీటి సంఘం అధ్యక్షుడిగా పిన్నింటి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా పతివాడ నరేష్ ఎన్నికయ్యారు.
- **చీపురుపల్లిరూరల్(గరివిడి):** గరివిడి మండలంలో 13 సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు తెలిపారు. అర్తమూరు సాగునీటి సంఘానికి గంగుపల్లి సత్యన్నారాయణ, వెదుళ్లవలస సాగునీటి సంఘానికి కిరాల చిన్న అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.
- **చీపురుపల్లి:** మండలంలో 11 నీటి సంఘాలకు సంబంధించి 66 టీసీలకు ఎన్నికలు నిర్వహించారు. 11 నీటి సంఘాల్లో 66 టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికకాగా, 11 నీటి సంఘాలకు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మెరకముడిదాం: మండలంలోని 15 నీటి సంఘాలకు అధికారులు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. 15 సంఘాల ఎన్నికల్లో 14 నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే గర్భాం గొడ్డుతామర చెరువు ఎన్నిక ఇరువర్గాల రైతులు ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా పడింది.

వాహనాల మరమ్మతులకు ప్రత్యేక విధానం

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న వాహనాల మరమ్మతులకు ప్రత్యేక విధానాన్ని రూపొందించనున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని మేదరవీధి ప్రాంతంలో ఉన్న వెహికల్ డిపోను డీఈ శ్రీనివాసరావు, తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. డిపోలో పాడైన వాహనాలు ఎక్కువగా ఉండడానికి గమనించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేకమైన మెకానిక్‌ను ఏర్పాటు చేసి, వెల్డింగ్ మిషన్, ఇతర యంత్రాలు సమకూర్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ ఏ విధంగా ఉందో గమనించారు. కొన్నిచోట్ల రహదారులు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయడాన్ని చేసి వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.